సాక్షి పశ్చిమగోదావరి

గురువారం । 27 । జూన్ । 2024



మట్టి పరీక్ష.. పంటకు రక్ష

మట్టిని పరీక్షించి పోషకాల స్థాయిని తెలుసుకుని అందుకు అనుగుణంగా ఎరువులు వాడితే అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. 8లో ▸



'ఆటపాక'కు హంగులు

ఆటపాక పక్షుల విహార కేంద్రం మరింత ఆహ్లాదాన్ని పంచనుంది. జాతీయ రహదారి నుంచి నూతన రోడ్డును అందుబాటులోకి తెచ్చారు. 8లో ▸



సున్నాలగండిలో చిరుత దాడి

పోలవరం మండలం సున్నాలగండి సమీపంలో చిరుత దాడిలో మేక హతమైంది. పరిసర ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. 8లో ▸

వలంటీర్లకు షాక్!

- సచివాలయ ఉద్యోగులతో పింఛన్ల పంపిణీకి సర్కారు నిర్ణయం
- ప్రభుత్వ తీరుతో ఆందోళనలో వలంటీర్లు
- అధికారంలోకి వస్తే జీతం రూ.10 వేలు చేస్తామని ఎన్నికల ముందు కూటమి హామీ
- గత ప్రభుత్వంలో ప్రజలకు అన్నీతామై సేవలందించిన వలంటీర్లు
- ఉమ్మడి జిల్లాలో 9,547 మంది వలంటీర్లు విధుల్లోనే



వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ (ఫైల్)

సాక్షి, భీమవరం: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పనిచేసిన వలంటీర్ల భవితవ్యం అగమ్యగోచరంగా మారింది. సచివాలయ ఉద్యోగులతో పింఛన్ల పంపిణీ చేయాలని కూటమి నిర్ణయం వారిని ఆందోళనకు గురిచేస్తోంది. అధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని, గౌరవ వేతనం రూ.10 వేలకు పెంచుతామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి పింఛన్లు పంపిణీ చేసే కీలక బాధ్యతల నుంచి వారిని తప్పించడం అనుమానాలకు తావిస్తోంది. పేదల చెంతకే ప్రభుత్వ పథకాలను చేరవేసేందుకు 2019 ఆగస్టు 15న నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో 50 ఇళ్లకు, పట్టణ ప్రాంతాల్లో 75 నుంచి 100 ఇళ్లకు ఒక వలంటీర్‌ను ఏర్పాటుచేశారు. ఉమ్మడి జిల్లాలో 18,867 మందికి పశ్చిమగోదావరి జిల్లాలో 8,616 మంది, ఏలూరు జిల్లాలో 10,251 మందిని నియమించారు. రూ.5 వేల గౌరవ వేతనంతో పారదర్శకంగా సేవలందించి ప్రశంసలు అందుకున్నారు. కరోనా మహమ్మారికి జడిసి అయినవాళ్లే దగ్గరకు రాని సమయంలో కోవిడ్ బాధితులు కోలుకునేంత వరకు వారికి అండగా ఉన్నారు. ప్రతీనెల 1వ తేదీన తెలవారకుండానే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందించడంతో పాటు అనారోగ్యంతో ఇతర రాష్ట్రాల్లో చికిత్సపొందుతున్న లబ్ధిదారుల చెంతకు సైతం వెళ్లి ప్రభుత్వ సాయాన్ని అందజేస్తూ ఆదర్శంగా నిలిచారు. లబ్ధిదారుల పడిగాపుల మధ్య గతంలో రోజుల తరబడి సాగిన పింఛన్ల పంపిణీ ఈ ఐదేళ్లలో ఒకటో తేదీనే 90 శాతం పైగా పంపిణీ జరగడం వారి పనితీరుకు నిదర్శనం. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చే వరకు ప్రతి పేద ఇంటికి అన్నీ తామై అండగా వలంటీర్లు సేవలందిస్తూ వచ్చారు. వలంటీర్ వ్యవస్థపై ఫిర్యాదుల నేపథ్యంలో ఏప్రిల్ నుంచి వారి సేవలకు బ్రేక్ పడింది. తదనంతర పరిణామాల్లో ఉమ్మడి జిల్లాలో 9,547 మంది వలంటీర్లు రాజీనామాలు చేయగా 9,320 మంది వరకు వలంటీర్లు విధుల్లోనే ఉన్నారు.

వలంటీర్లకు బాబు వెన్నుపోటు

ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్



మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలుచేసిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచింది. పింఛన్లు, ప్రభుత్వ పథకాల కోసం పడిగాపులు, కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరిగే రోజులు పోయాయి. ప్రజలకే చెంతకే ప్రభుత్వ పథకాల లబ్ధిని వలంటీర్లు అందజేస్తూ వచ్చారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేయాల్సింది పోయి బాబు మార్కు వెన్నుపోటు రాజకీయం చేస్తున్నారు. వలంటీర్ల సేవలకు మంగళం పాడేందుకే పింఛన్ల పంపిణీని నుంచి వారిని దూరం చేశారు.

ఆశనిపాతంలా ప్రభుత్వ నిర్ణయం

తాము అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని, గౌరవ వేతనం రూ.10 వేలకు పెంచుతామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. మేనిఫెస్టోలోను ఈ అంశాన్ని పొందుపర్చారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో ఎన్నికల హామీలపై ప్రభుత్వ ప్రకటన కోసం వలంటీర్లు గంపెడాశతో ఎదురుచూస్తున్నారు. త్వరలో తమను విధుల్లోకి తీసుకుంటారని భావించారు. జూలైలో సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం నిర్ణయించడం వారికి ఆశనిపాతంలా మారింది. వలంటీర్ వ్యవస్థకు ఆగస్టు 14వ తేదీ వరకు గడువుండగా కొనసాగించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేయాల్సి ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో తమ భవితవ్యం అగమ్యగోచరంగా మారిందని వారు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేస్తూ తమను కొనసాగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డ్రగ్స్‌తో భవిష్యత్ అంధకారం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నేటి సమాజంలో డ్రగ్స్ వాడకం ఎక్కువైందని, పిల్లల్ని చేసుకుని మాదకద్రవ్యాలు అలవాటు చేస్తున్నారని, తద్వారా వాటికి బానిసవుతున్నారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే రత్నప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక 12 పంపుల సెంటర్లోని గాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాల జోలికి వెళ్ళకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఎలాంటి వస్తువులను గాని, తినే పదార్థాలు గాని తీసుకోరాదని ఎవరిపైనైనా అనుమానం ఉంటే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. బాలికలు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని, తల్లిదండ్రులతో, ఉపాధ్యాయులతో వారి సమస్యలను ఎప్పటికప్పుడు చర్చిస్తూ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్లు కే వెంకటేశ్వరరావు, కే రత్నరాజు, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు కే కృష్ణ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వ్యాధి నిరోధక టీకాలు అందించాలి



లంకలకోడేరు సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

పాలకొల్లు అర్బన్: ప్రతి బిడ్డకు వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా అందించాలని జిల్లా వైద్యాధికారి డా. డి మహేశ్వరరావు కోరారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు గ్రామ సచివాలయం -1లో బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమాన్ని పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో గర్భిణులకు ఇచ్చే మాతా శిశు సంరక్షణ కార్డు తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. ఏ వ్యాక్సిన్ ఏ వ్యాధికి పనిచేస్తుందో వివరంగా తెలియజేయాలన్నారు. వ్యాక్సిన్ అందజేసిన డోసుల వివరాలను యాప్‌లో, రిజిస్టర్లలో నమోదు చేసుకోవాలని చెప్పారు.

ఏలూరు కలెక్టర్‌గా వెట్రిసెల్వి బాధ్యతల స్వీకరణ

ఏలూరు(మెట్రో): జిల్లాలో అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించి మొదటిస్థానంలో ఉంచేందుకు చర్యలు తీసుకుంటానని నూతన కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. బదిలీపై ఏలూరు జిల్లా కలెక్టర్‌గా వచ్చిన ఆమె బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో స్థితిగతులను పూర్తి స్థాయిలో అవగాహన చేసుకుని జిల్లాను అన్ని రంగాల్లో ముందుస్థానంలో నిలిపేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. జిల్లాలో పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి, దేశానికి తలమానికంగా ఉందని పోలవరంపై పూర్తి దృష్టి కేంద్రీకరించి పూర్తికి తనవంతు కృషిచేస్తానని చెప్పారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపైనా దృష్టి కేంద్రీకరిస్తానని చెప్పారు. జిల్లాలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి మెరుగుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా ఫిర్యాదులు సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యలను నేరుగా తన నెంబర్ 94910 41488కు తెలియజేయవచ్చని ఆమె వివరించారు.

జెడ్పీ చైర్‌పర్సన్ శుభాకాంక్షలు

పెదపాడు: ఏలూరు జిల్లా కలెక్టరుగా బాధ్యతలు చేపట్టిన వెట్రి సెల్విని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మర్యాదపూర్వకంగా కలిసారు. కలెక్టరు కార్యాలయానికి వెళ్లి శాలువతో సత్కరించి పూల కుండీని అందించారు.

డీఈఎల్ఈడీ పరీక్షకు 61 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): డీఈఎల్ఈడీ 4వ సెమిస్టర్ పరీక్షల్లో భాగంగా బుధవారం జరిగిన పరీక్షకు 61 మంది విద్యార్థులు హాజరయ్యారని, విద్యార్థుల హాజరు నూరు శాతంగా నమోదయిందని జిల్లా విదాశాఖాధికారి ఎస్. అబ్రహం తెలిపారు. పరీక్షల్లో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులూ నమోదు కాలేదని, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు.

సాగునీరు అందక ఇబ్బందులు

భీమవరం: జిల్లాలో సార్వా సీజన్ ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా వ్యవసాయానికి పూర్తి స్థాయిలో సాగునీరందడం లేదని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డెల్టా ప్రాంతంలో వ్యవసాయానికి ప్రస్తుతం 7 వేల క్యూసెక్కుల నీరు అవసరం కేవలం 4,600 క్యూసెక్కుల నీరు వదులుతున్నారన్నారు. పోడూరు, యలమంచిలి, పాలకొల్లు, నరసాపురం, వీరవాసరం, భీమవరం తదితర మండలాల్లో సాగునీరు సమస్య తీవ్రంగా ఉండడంతో ఈ ప్రాంతాల్లో ఇంకా 40 శాతం నారుమళ్లు వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో 39 శాతం ఉత్తీర్ణత

భీమవరం: ఇంటర్ మొదటి సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో 39 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఇంటర్ విద్య జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారి చంద్రశేఖర్‌బాబు బుధవారం చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 4,256 మంది పరీక్షలకు హాజరుకాగా 1,445 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఎయిడెడ్ కళాశాల విద్యార్థులు 37 మంది ఉత్తీర్ణత సాధించగా ఏపీఆర్‌డబ్ల్యూర్ విద్యార్థులు 17 మందికి 4గురు, ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు 448 మందికి 143 మంది, ప్రైవేటు అన్‌ఎయిడెడ్ విద్యార్థులు 3,546 మందికి 1,230 మంది, హైస్కూల్ ప్లస్ విద్యార్థులు 118 మందికి 31 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. మార్కుల మెమోలు జూలై 1 నుంచి ఇంటర్ బోర్డు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని చంద్రశేఖరబాబు తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, ఓటమి బాధ నుంచి పార్టీ శ్రేణులు బయటకు వచ్చి ధైర్యంగా ఉండాలని మాజీ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సూచించారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుల, మత, ప్రాంత, పార్టీ విభేదాలు చూడకుండా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లపాటు రాష్ట్రంలో సంక్షేమ పాలన అందించారని చెప్పారు. నూరు శాతం హామీలు అమలు చేసిన ముఖ్యమంత్రి ఉన్నారంటే అది జగన్ అని గర్వంగా ప్రతీ కార్యకర్త చెప్పుకునేలా పాలన అందించారని అన్నారు. దురదృష్టం కొద్దీ ఓటమి పాలైనా మన ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలు త్వరలోనే గ్రహిస్తారని చెప్పారు. అధికార కూటమి ఇచ్చిన హామీలు అమలు చేసే విధంగా ప్రజల పక్షాన పోరాడదామని పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, పార్టీ కేంద్ర పాలకమండలి సభ్యుడు పీడీరాజు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కామన బుజ్జి, పెండ్ర వీరన్న, ఇంజేటి జాన్ కెనడీ, చాగంటి సత్యనారాయణ, షేక్ బులిమస్తాన్ మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే వెన్నుముక అన్నారు. ప్రతిపక్షంలో ఉండి పోరాటాలు చేయడం మనకు కొత్తకాదని, కార్యకర్తలు అధైర్యపడకుండా ముందుకు సాగాలని అన్నారు. సమావేశంలో జెడ్పీటీసీలు బొక్కా రాధాకృష్ణ, తిరుమాని బాపూజీ, తిరుమాని నాగరాజు, బర్రి శంకరం, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు బూసరపు జయ, దొంగ మురళీకృష్ణ, పప్పుల రామారావు, మోటుపల్లి రామ్‌బాస్కర్, కావలి నాని, బందన పూర్ణచంద్రరావు, మావూరి సత్యనారాయణ, వంగలపూడి జక్కరయ్య, పార్టీ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



విష్ణు కళాశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ అజిత, జేసీ ప్రవీణ్ ఆదిత్య తదితరులు

భీమవరం: దేశ భవిష్యత్ యువత చేతిలో ఉందని మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ మాదక ద్రవ్యాల నియంత్రణకు సహకరించాలని జిల్లా ఎస్పీ వేజెండ్ల అజిత, జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య అన్నారు. బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా భీమవరం పట్టణంలోని జువ్వలపాలెం రోడ్డు నుంచి బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బీవీ రాజు కాలేజీ ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత జిల్లాగా చేయడానికి అధికారులు, పోలీసుశాఖకు యువత సహకరించాలన్నారు. యువతను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని కళాశాలల్లో పోలీసుశాఖ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జాయింట్ కలెక్టర్ ప్రవీణ్‌ఆదిత్య మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతిలో ఉందన్నారు. జిల్లాలోని వైద్య, ఆరోగ్యం, రెవెన్యూ, విద్య, అటవీ, డ్రగ్స్ తదితర శాఖల అధికారులంతా పోలీసుశాఖతో సమన్వయం చేసుకుని మాదక ద్రవ్యాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. జిల్లాలోని మార్కెటింగ్, అటవీ, పోలీసు అన్ని చెక్ పోస్టుల వద్ద అధికారులు పటిష్ట నిఘా పెట్టాలన్నారు. కార్యక్రమంలో సెబ్ ఏఎస్పీ ఏటీవీ రవి కుమార్, బీవీ రాజు కళాశాల ప్రిన్సిపల్ ఎం.వేణు, వైస్ ప్రిన్సిపల్ ఎం.శ్రీలక్ష్మి, స్టూడెంట్స్ కోఆర్డినేటర్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో ఫోన్ బిల్లుల పరిష్కారం

ఏలూరు (టూటౌన్): ఈ నెల 29న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో టెలిఫోన్ బిల్లులు పరిష్కరించుకోవాలని టెలికాం జనరల్ మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ బిల్లులు బకాయిపడ్డ వినియోగదారుల సౌకర్యార్థం ఏలూరు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, తాడేపల్లిగూడెం, నిడదవోలు, కొవ్వూరు, తణుకు, భీమవరం, నరసాపురం పరిధిలోని లోక్ అదాలత్ కోర్టుల్లో పరిష్కరించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 94947 08898, 94903 12777, 94404 33633 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఒత్తిడిని అధిగమించాలి



కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభోత్సవంలో ఉద్యాన వర్సిటీ వీసీ జానకీరామ్

తాడేపల్లిగూడెం: నేటి పోటీయుగంలో ఒత్తిడిని అధిగమించడం, సమయపాలన, సృజనాత్మకత ప్రముఖ పాత్ర వహిస్తాయని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ టి.జానకీరామ్ చెప్పారు. వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం వెంకట్రామన్నగూడెం ఉద్యాన కళాశాలలో జాతీయ విద్య ప్రాజెక్టు కింద ఏర్పాటు చేసిన కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ సలోమి సునీత మాట్లాడుతూ ఎన్ఏహెచ్ఈపీ అందించిన మార్గదర్శకాల ద్వారా కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం, ఎంటర్ ప్రెన్యూర్ షిప్, ఇన్నోవేషన్, పూర్వవిద్యార్థులతో కో ఆర్డినేషన్, ప్లేస్‌మెంటు కో ఆర్డినేషన్, ఐడియా ఫిట్టింగ్ ప్రోగ్రాం అనే లక్ష్యాలతో ఈ కేంద్రం పనిచేస్తుందన్నారు.

మూత్రపిండాలకు ముప్పు

- డయాలసిస్‌కు క్యూ కడుతున్న జనం
- హైబీపీ, మధుమేహంతో కిడ్నీలపై ఒత్తిడి
- ఉమ్మడి జిల్లాలో 963 మందికి పైగా డయాలసిస్ రోగులు, 630 మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులు



తణుకులో డయాలసిస్ చేయించుకుంటున్న కిడ్నీ రోగులు

ఆకివీడు: ఇటీవల జిల్లాలో మూత్ర పిండాల వ్యాధితో బాధపడుతున్న రోగుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ఆహారంలో మార్పులు, బీపీ, సుగర్ పెరిగిపోవడంతో ప్రధానంగా మూత్ర పిండాలపై అధిక ప్రభావం చూపుతోంది. తీసుకునే ఆహారంలో మార్పులు, శారీరక వ్యాయామం పూర్తిగా లేకపోవడంతో సుగర్ సులువుగా అటాక్ అవుతోంది. సుగర్‌ను నియంత్రించుకోలేకపోవడంతో దీని ప్రభావానికి గురై జిల్లాలో మూత్రపిండాల ఇబ్బందులతో డయాలసిస్ చేయించుకుంటున్న వారి సంఖ్య ఏటా పెరిగిపోతుంది.

డయాలసిస్‌కు చేయించుకుంటున్నవారు ఉమ్మడి జిల్లాలో సుమారుగా 963 మందికి పైగా ఉన్నారు. ఒక్క తణుకు డయాలసిస్ కేంద్రంలోనే 80 మందికి పైగా డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఏలూరులోని ఆశ్రం ఆసుపత్రిలో 118 మంది, జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో 140 మంది, పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో డయాలసిస్ చేయించుకుంటున్నవారి సంఖ్య వందలల్లోనే ఉంది. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు కిడ్నీ బాధితులు హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి, వైజాగ్ వంటి పెద్ద ఆసుపత్రుల్లో వైద్యం పొందతున్నారు. డయాలసిస్‌కు గురైన వారే కాకుండా కిడ్నీలకు సంబంధించి ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారు వేలల్లోనే ఉన్నారంటే అతిశయోక్తి కాదు. కిడ్నీ ఇబ్బందులతో ఇటీవల కాలంలో పలువురు మృత్యువాత పడిన సంఘటనలున్నాయి. కిడ్నీలు రక్తం నుంచి పదార్థాలను ఫిల్టర్ చేసే అతి ముఖ్యమైన అవయవాలు. ప్రోటీన్, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, పొటాషియం, ఫాస్పరస్ వంటివి మూత్ర పిండాలను మరింత శక్తివంతంగా చేసేందుకు దోహదపడతాయి.

కిడ్నీకి వచ్చే వ్యాధులివే.. కిడ్నీకి పలు వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. కిడ్నీలు ఇన్ఫెక్షన్‌కు గురై సరిగా పనిచేయకపోతే డయాలసిస్ చేయాల్సి వస్తుంది. కిడ్నీలో స్టోన్స్(రాళ్లు), సిస్ట్(పస గడ్డలు కట్టడం), రీనల్ క్యాలికులై, హైడ్రో నెఫ్రోసిస్(వాపు)కు గురికావడం, ఫిల్టర్ చేయకుండా ఉండటంతో యూరిన్ బయటకు రాకపోతే రీనల్ సిస్ట్, యూరేతేరల్ క్యాన్సర్(కిడ్నీ క్యాన్సర్)కు గురికావడం, నెఫ్రాటిక్ సిండ్రోమ్(కిడ్నీ రోగం) వంటివి కిడ్నీ బాధితుల్లో వస్తుంటాయి.

సుగర్‌ను నియంత్రించాలి



సుగర్‌ను నియంత్రించుకుంటే కిడ్నీ వ్యాధి తీవ్రతను తగ్గించుకోవచ్చు. డయాలసిస్ వరకూ వెళ్లనవసరం లేదు. పశ్చిమ జిల్లాలో 30 శాతం మంది సుగర్ వ్యాధితో బాధపడుతున్నట్లు అంచనా. రానున్న రోజుల్లో సుగర్ వ్యాధిగ్రస్తులు మరింత పెరిగే ప్రమాదం లేకపోలేదు. తినే తిండిలో మార్పులు రావాలి. వ్యాయామం ఉండాలి.

– డాక్టర్ మహేశ్వరరావు, జిల్లా వైద్యాధికారి, భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా

ఆహారంలో మార్పులు అవసరం



ప్రజలు తీసుకునే ఆహారంలో పూర్తి మార్పు రావాలి. సుగర్, బీపీలు రాకుండా చూసుకోవాలి. వచ్చిన తరువాత వాటిని నియంత్రించుకోవాలి. ప్రతీ రోజూ నడక, వ్యాయామం అవసరం. చిన్న పిల్లలు ఎక్కువగా ఫాస్ట్‌ఫుడ్‌లు తింటూ ఊబకాయంతో పెరుగుతున్నారు. భవిష్యత్‌లో తీవ్ర ఆరోగ్య ఇబ్బందులకు గురవుతారు.

– ఎండీ.అజ్మీనా నస్రీన్, సీహెచ్‌సీ ఇన్‌ఛార్జి సూపరింటిండెంట్, ఆకివీడు.

సుగర్‌తో కిడ్నీపై ప్రభావం



కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాను. సుగర్ లెవల్స్ పెరగడంతో కిడ్నీ అనారోగ్యానికి గురైంది. భీమవరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నాను. అక్కడకు వెళ్ళాలంటే ఇబ్బందికరంగా ఉంది. ఆకివీడు ఆసుపత్రిలో డయాలసిస్ యూనిట్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతంలో డయాలసిస్, కిడ్నీ రోగులకు కొంత ఉపసమనంగా ఉంటుంది.

– షేక్ హమీదా, డయాలసిస్ పేషెంట్, ముస్లిం వీధి, ఆకివీడు

జూలైలో పీఎం విశ్వకర్మ కిట్స్

భీమవరం: ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంలో శిక్షణ పొందిన లబ్ధిదారులకు జూలై మొదటివారంలో టూల్‌కిట్స్ అందిస్తామని ఆర్‌డీఎస్‌డీఈ సౌత్ రీజినల్ డైరెక్టర్ కె శ్రీనివాసరావు అన్నారు. బుధవారం భీమవరం పట్టణంలోని శ్రీరాఘవేంద్ర ఐటీఐ కళాశాలలో శ్రీటెక్నాలజీస్ ద్వారా శిక్షణ పొందిన వివిధ వృత్తులవారికి సర్టిఫికెట్స్ అందజేశారు. ప్రధానమంత్రి విశ్వకర్మ ప్రోగ్రాంలో రానున్న రోజుల్లో అడ్వాన్స్ ప్రోగ్రామ్ రానుందని దానిని కూడ దక్షిణభారత దేశంలో మొట్టమొదటిసారిగా పశ్చిమగోదావరి జిల్లాలోనే ప్రారంభిస్తామని శ్రీనివాసరావు ప్రకటించారు. కార్యక్రమంలో ఆర్‌డీఎస్‌డీఈ జెడీ శాంతి, ఎంఎస్ఎంఈ డిప్యూటీ డైరెక్టర్ చంద్రమౌళి, ఎన్ఎస్‌డీసీ స్టేట్ ఎంగేజ్‌మెంట్ ఆఫీసర్ ప్రశాంత్, డీఎస్‌డీవో కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శోభనాచలపతి సుప్రభాత స్తోత్రం పుస్తకావిష్కరణ



ఆగిరిపల్లి శోభనాచలుని ఆలయంలో స్వామివారి పుస్తకావిష్కరణ

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలోని శ్రీశోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శ్రీశోభనాచల సుప్రభాత స్తోత్రం పుస్తకాన్ని స్వామివారి సన్నిధిలో బుధవారం ఆవిష్కరించారు. ఆగిరిపల్లికి చెందిన వేమూరి వెంకట్రామ సుబ్రహ్మణ్యం 1971లో స్వామివారి సుప్రభాతం, స్తోత్రాలు రచించారు. అనంతరం సుబ్రహ్మణ్యం కుమారుడు శ్రీనివాస్ మూర్తి, తన సోదరులతో కలిసి తన తండ్రి రచించిన శోభనాచలుని సుప్రభాతంతో పాటు, శోభనాచలుని ఆలయ చరిత్రను రచించి ముద్రించారు. బుధవారం స్వామివారి సన్నిధిలో పుస్తకాన్ని ఆవిష్కరించి ఆలయ కార్య నిర్వహణ అధికారి డి.సురేష్‌బాబుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతంశేషుబాబు, అనంతకృష్ణ, శ్రీనివాస మూర్తి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

6, 7 తేదీల్లో నూజివీడులో ఏఐటీయూసీ రాష్ట్ర సదస్సు



మాట్లాడుతున్న ఎస్.వెంకటసుబ్బయ్య

నూజివీడు: నూజివీడులో వచ్చే నెల 6, 7 తేదీల్లో ఏఐటీయూసీ రాష్ట్ర మేధోమదన సదస్సును విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్.వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు. సదస్సు నిర్వహణ ఏర్పాట్లను బుధవారం పరిశీలించిన అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో పలు సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీతో సహా కేంద్ర కార్మిక సంఘాలు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి విజ్ఞప్తి చేశాయన్నారు. ఉద్యోగులకు ఆదాయ పన్ను సీలింగ్ పరిధిని రెట్టింపు చేయాలని, సామాజిక భద్రతకి రూ.9వేల పెన్షన్ ఉండాలని, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తదితర డిమాండ్‌లను ఆర్థిక మంత్రి ముందు ఉంచామన్నారు. కార్మిక సంఘాల నాయకులు సదస్సులో పాల్గొని సూచనలు, సలహాలు అందించాలన్నారు. ఏఐటీయూసీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు, నాయకులు ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.

‘ఆటపాక’కు అదనపు హంగులు

- మరింత ఆహ్లాదంగా ఆటపాక పక్షుల విహార కేంద్రం
- రూ.15 లక్షల వ్యయంతో అదనంగా సౌకర్యాలు
- పక్షుల ఆవాసాలకు సిద్ధం చేసిన 64 ఇనుప స్టాండ్లు
- కేంద్రంలో గోడలపై ఆకట్టుకుంటున్న పక్షుల చిత్రాలు
- చిల్డ్రన్ పార్కులో రంగులతో క్రీడా పరికరాలు రెడీ



పక్షుల గూళ్ల ఏర్పాటు కోసం సిద్ధం చేసిన ఇనుప స్టాండ్లు



ముస్తాబైన చిల్డ్రన్ పార్కు





ఆటపాక పక్షుల విహార కేంద్రం పార్కులో గోడలపై ఆకట్టుకుంటున్న వివిధ రకాల పక్షులు, చేపల చిత్రాలు

కైకలూరు: పక్షి ప్రేమికుల స్వర్గధామంగా పేరుగడించిన ఆటపాక పక్షుల విహార కేంద్రం మరింత ఆహ్లాదాన్ని పంచేందుకు అదనపు హంగులను సమకూర్చుకుంటోంది. అటవీశాఖ ఆధ్వర్యంలో వేసవిలో చేపట్టాల్సిన పనులను పూర్తి చేశారు. ప్రతి ఏటా ఆటపాక పక్షుల విహార కేంద్రానికి విచ్చేస్తున్న స్వదేశీ, విదేశీ పక్షుల సంఖ్య పెరుగుతుండటంతో అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లను చేస్తున్నారు. ఇప్పటికే పామర్రు–దిగమర్రు జాతీయ రహదారి నుంచి పక్షుల కేంద్రం వరకు నూతన రోడ్డు, ప్రారంభ టికెట్ కౌంటర్ నుంచి పక్షి నమూనా మ్యూజియం వరకు రోడ్డును నిర్మించారు.

289 ఎకరాల్లో భారీ చెరువు

ఆటపాక పక్షుల కేంద్రం ఈ పేరు చెప్పగానే పెలికాన్, పెయింటెడ్ స్టార్క్ పక్షుల కేరింతలు గుర్తుకొస్తాయి. ఇక్కడ 289 ఎకరాల్లో పక్షుల విహరించడానికి చెరువును నిర్మించారు. ప్రతి ఏటా అక్టోబర్ నుంచి మార్చి వరకు సైబీరియా, నైజీరియా, ఇండోనేషియా, శ్రీలంక, ఆస్ట్రేలియా వంటి దేశాల నుంచి వలస పక్షులు విడిదికి కొల్లేరు విచ్చేస్తాయి. ముఖ్యంగా పెలికాన్ పక్షులు ఇక్కడే గుడ్లు పెట్టి సంతానోత్పత్తి చేసుకుని తిరిగి పిల్లలతో పుట్టింటికి వెళతాయి. ఎక్కువ సంఖ్యలో పెలికాన్ పక్షులు ఇక్కడకు రావడంతో ఈ కేంద్రానికి పెలికాన్ ప్యారడైజ్‌గా నామకరణం చేశారు.

రూ.15 లక్షలతో అభివృద్ధి పనులు

ఆటపాక పక్షుల విహార కేంద్రంలో రూ.15 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. పక్షుల కేంద్రం ప్రారంభంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేసి గేటును అమర్చారు. స్వాగతబోర్డును అందంగా తీర్చిదిద్దారు. సమీపంలో పర్యాటకుల కోసం షెడ్డును నిర్మించారు. అదే విధంగా పక్షుల కేంద్రంలో గోడల చుట్టూ పర్యాటకులను ఆకట్టుకోడానికి కొల్లేరు సరస్సులో విహరించే వివిధ జాతుల పక్షుల చిత్రాలను ముద్రించారు. చిల్డ్రన్ పార్కులో ఆట వస్తువులకు మరమ్మతులు చేసి రంగులు వేశారు. విహార బోట్లకు మరమ్మతులు చేశారు. పక్షి నమూనా మ్యూజియం వద్ద పర్యాటకుల కోసం ఏసీ, కూలింగ్ వాటర్ కోసం ఫ్రిజ్‌ను ఏర్పాటు చేశారు. నిఘా కోసం సీసీ కెమెరాలను సైతం అటవీశాఖ అమర్చింది.

ఇప్పటికే 145.. అదనంగా మరో 64 ఏర్పాటు

ఆటపాక పక్షుల విహార కేంద్రం చెరువులో పూర్వం తుమ్మచెట్లు ఎక్కువగా ఉండేవి. పక్షుల విసర్జకాలలో యాసిడ్ వంటి పదార్థం ఉండటంతో అవి మొక్కలపై పడి ఎండిపోయేవి. ఇటువంటి పరిస్థితుల్లో వలస పక్షులకు గూడు కల్పించాలనే ఉద్దేశంతో ఇనుముతో స్టాండ్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం విహార చెరువులో 145 స్టాండ్లు అందుబాటులో ఉండగా, పెరుగుతున్న పక్షుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని తాజాగా మరో 64 కొత్త స్టాండ్లను తయారు చేశారు. వీటిపై పెలికాన్ పక్షులు గూళ్ల ఏర్పాటు చేసుకుని సంతానోత్పత్తి సాగిస్తాయి.

సౌకర్యాలు మెరుగుపరుస్తున్నాం



ఆటపాక పక్షుల కేంద్రం సందర్శనకు వచ్చే పర్యాటకులకు సౌకర్యాలను మెరుగుపరుస్తున్నాం. యాత్రికులకు కూలింగ్ వాటర్ అందిస్తున్నాం. చిన్నారులను ఆకట్టుకునేలా పక్షుల చిత్రాలను గోడలపై చిత్రించాం. జాతీయ రహదారిపై ఆటపాక పక్షుల విశేషాలను వివరిస్తూ బోర్డులు ఏర్పాటు చేశాం. రానున్న పక్షుల సీజన్ నిమిత్తం ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకున్నాం. – జీవీవీ.జయప్రకాష్, డెప్యూటీ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్, కైకలూరు.

పోలీసు శాఖకు బ్యాంక్ ఆఫ్ బరోడా సేవలు భేష్

- ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్
- ఆకివీడులో బ్యాంక్ శాఖ ప్రారంభం



ఆకివీడులో బ్యాంక్ శాఖను ప్రారంభించిన ఐజీ అశోక్‌కుమార్

ఆకివీడు: దేశంలో రెండో అతి పెద్ద బ్యాంక్‌గా విరాజిల్లుతోన్న బ్యాంక్ ఆఫ్ బరోడా ఆకివీడు శాఖను ప్రారంభించడం ఆనందంగా ఉందని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ అన్నారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో బ్యాంక్ శాఖ కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖకు శాలరీ ప్యాకేజ్ ఇవ్వడం, శాఖలో ఉన్నత స్థానంలో ఉన్న ఉద్యోగి మృతి చెందితే రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వడం హర్షదాయకమన్నారు. బ్యాంక్ జోనల్ మేనేజర్ రితేష్ కుమార్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో రూ.24 లక్షల కోట్ల టర్నోవర్‌తో బ్యాంక్ నడుస్తోందని చెప్పారు. ఖాతాదారులకు ఉపయోగకరమైన పలు సేవలందిస్తున్నామన్నారు. తక్కువ వడ్డీతో రుణాలు, ఎక్కువ వడ్డీకి డిపాజిట్లు సేకరిస్తున్నామని చెప్పారు. ఆక్వా, ఇతర వ్యాపార హబ్‌గా ఉన్న ఆకివీడులో తమ బ్యాంక్ సేవలందించడం గర్వకారణమని చెప్పారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి మాట్లాడుతూ ప్రజలకు మరిన్ని సేవలందించే దిశగా బ్యాంకు నడవాలని ఆకాంక్షించారు. నగర పంచాయతీ వైస్‌చైర్‌పర్సన్ వంగా జ్యోత్స్న, ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు, డీజీఎం చందన్ చాహా, బీఎం పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

‘షట్టర్’ దొంగల ఆటకట్టు

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- రూ.2,41,500 విలువైన చోరీ సొత్తు స్వాధీనం



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న కెమెరాను చూపిస్తున్న క్రైం డీసీపీ ఎం.వెంకటరత్నం

అల్లిపురం: రాత్రి వేళల్లో బైక్‌ల దొంగతనాలు, షాపుల షట్టర్ల తాళాలు బద్దలు కొట్టి చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని నగర క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. నగర పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నగర క్రైం డీసీపీ ఎం.వెంకటరత్నం ఈ వివరాలు వెల్లడించారు. పెదగంట్యాడ దొమ్మేటివీధికి చెందిన చిత్తారపు అభిషేక్ అలియాస్ అభి, పశ్చిమగోదావరి జిల్లా భీమవరం చిన్నపేట, రామాయణ సుబ్బన్నతోటకు చెందిన కింగం హరిగణేష్, భీమవరం, యనమదుర్రు, దేగాపురానికి చెందిన జువ్వాల అశోక్ అలియాస్ బబ్లూ గాజువాక, న్యూపోర్టు, మహారాణిపేట, కంచరపాలెం, ఫోర్తు టౌన్, పెందుర్తి, మల్కాపురం పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు షాపుల్లో చోరీలకు పాల్పడ్డారు. వీరిని అరెస్ట్ చేసిన పోలీసులు.. మొత్తం 13 కేసుల్లో రూ.2,41,500 విలువ గల ఆరు సెల్‌ఫోన్లు, రూ.35,400, కెనాన్ 81డీ కెమెరా, 2 బైక్‌లను వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. నిందితులు మొత్తం రూ.2,70,800 విలువైన సొత్తు చోరీ చేసినట్లు డీసీపీ తెలిపారు.

చెడు వ్యసనాలకు అలవాటు పడి..

నిందితుల్లో ఒకడైన చిత్తారపు అభిషేక్ భీమవరంలోని తన అమ్మమ్మ ఇంటికి వెళ్లినప్పుడు..అక్కడ కింగం హరి గణేష్, జువ్వాల అశోక్‌తో పరిచయం పెంచుకున్నాడు. వారితో కలిసి మద్యం, గంజాయి సేవించి చెడు అలవాట్లకు బానిసయ్యాడు. సులభంగా డబ్బులు సంపాదించాలనే అత్యాశతో ముగ్గురూ కలిసి దొంగతనాలు చేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో అభిషేక్‌పై 2, కింగం హరి గణేష్‌పై 40, జువ్వాల అశోక్‌పై 28 దొంగతనం కేసులు నమోదయ్యాయి. వీటిలో షట్టర్లు బద్దలుగొట్టి షాపుల్లో చోరీలు, బైక్, హుండీల దొంగతనాలు ఉన్నాయి. కాగా.. రాత్రి పూట షట్టర్లకు సెంట్రల్ లాకింగ్ సిస్టమ్ పెట్టుకోవాలని, షాపుల్లో డబ్బులు ఉంచవద్దని డీసీపీ వెంకటరత్నం దుకాణ యజమానులకు సూచించారు.

విద్యుదాఘాతానికి తాత్కాలిక ఉద్యోగి మృతి



చంద్రపాల్ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

నరసాపురం రూరల్: తాగునీటిని ట్యాంక్‌లోకి ఎక్కించేందుకు విద్యుత్ మోటారు ఆన్ చేస్తుండగా షాక్‌కు గురై పంచాయతీ తాత్కాలిక ఉద్యోగి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. కొప్పర్రు గ్రామంలో పీతలవాని గరువు ప్రాంతానికి చెందిన బుగ్గే చంద్రపాల్ (60) కొంతకాలంగా పంచాయతీ తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. బుధవారం సాయంత్రం పంచాయతీ తాగునీటి విద్యుత్ మోటార్‌ను ఆన్ చేసేందుకు వెళ్లగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన జరిగిన ప్రాంతాన్ని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, ఎంపీడీవో ఎం.వెంకటరమణ, విద్యుత్‌శాఖ అధికారులు, ఈవోపీఆర్డీ ఆంజనేయశర్మ పరిశీలించారు. గతంలో ఇదే విద్యుత్ మోటార్ కారణంగా ఓ వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురి కాగా, ఎలక్ట్రికల్ సిబ్బంది స్పందించి విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రమాదం నుంచి బయటపడటం తెలిసిందే.

యువతి అదృశ్యం

పాలకోడేరు: తన కుమార్తె ఈనెల 24వ తేదీ నుంచి కనిపించటం లేదని శృంగవృక్షం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. 21 ఏళ్ల వయస్సున్న తన కుమార్తె చదువుకోలేదని, ఇంట్లోనే ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు తమకు సమాచారం అందించాలని కోరారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

భీమవరం అర్బన్: సహజీవనం చేస్తున్న మహిళ పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుడివాడ మండలం మందపాడు గ్రామానికి చెందిన గలగలేటి రేణుక, సుబ్బారావు (42) భార్యాభర్తలు. వీరి మధ్య మనస్పర్థలు రావడంతో ఏడాదిన్నర క్రితం విడిపోయారు. వీరికి ఇద్దరు కుమారులు. గలగలేటి సుబ్బారావు దొంగపిండి గ్రామంలోని వేటుకూరి శ్రీనివాసరాజుకు చెందిన చేపల చెరువు వద్ద నెలవారీ మేతకట్టే పనిచేస్తున్నాడు. సుబ్బారావు మరో మహిళ నాగమణితో సహజీవనం చేస్తూ కుమారులతో ఉంటున్నాడు. ఇటీవల సహజీవనం చేస్తున్న నాగమణి పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్తాపానికి గురైన సుబ్బారావు మంగళవారం సాయంత్రం పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించగా కుమారుడు చూసి చెరువు వద్ద గుమస్తాకు సమాచారమిచ్చాడు. సుబ్బారావును భీమవరంలోని ఆస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. నాగమణి ఫిర్యాదు మేరకు హెచ్‌సీ పి.మహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యాన వర్సిటీ వీసీగా తోలేటి నియామకం చెల్లదు

తీర్పు వెలువరించిన హైకోర్టు



వీసీ టి.జానకీరామ్

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ ఉప కులపతి డాక్టర్ తోలేటి జానకీరామ్ నియామకం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం జరగలేదని, సెర్చ్ కమిటీ నిబంధనల ఉల్లంఘన జరిగిందని ఈ క్రమంలో వీసీ నియామకం చెల్లదని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. వీసీ నియామక ప్రక్రియ సరిగా జరగలేదంటూ, మార్గదర్శకాల ఉల్లంఘన జరిగినట్టుగా పల్నాడు జిల్లా మాచర్ల మండలం కొప్పునూరుకు చెందిన ఏపీ షెడ్యూల్డు ట్రైబ్ కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మధువతు దారునాయక్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం వేశారు. ఇదే విషయమై హైదరాబాద్ కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన రిటైర్డు శాస్త్రవేత్త డాక్టర్ జి.రవిశంకర్‌రెడ్డి రిట్ వేశారు. ఉద్యాన వర్సిటీ వీసీగా తొలిసారి, రెండోసారి టి.జానకీరామ్‌ను నియమించడం మార్గదర్శకాలకు విరుద్ధమని, ఈ క్రమంలో వీసీ నియామకం తప్పని ఈ కేసు విచారణలో కోర్టు తేల్చింది. వీసీ ఎంపిక విధానంలో సెర్చ్ కమిటీలో మూడో సభ్యునిగా ఉన్న యూజీసీ చైర్మన్ పరోక్షంలో వీసీ ఎంపిక జరగడం, ఈ నియామకానికి సంబంధించి జీఓ ఆర్‌టీలు మూడుసార్లు ఇవ్వడం, సభ్యులను మార్చడం, నోటిఫికేషన్‌లు ఇవ్వడం వంటి ప్రక్రియ తర్వాత వీసీ నియామకం జరిగిందని న్యాయమూర్తి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విచారణ అనంతరం బుధవారం వీసీ పోస్టు భర్తీ సక్రమంగా జరగలేదంటూ క్వాష్ ఆర్డర్‌ను ఇచ్చింది.

పీడిత వర్గాల కోసం పోరాడిన పరస

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

భీమవరం: పీడిత వర్గాల పక్షాన నిలబడి పోరాడిన యోధుడు, సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు పరస సత్యనారాయణ ధన్యజీవని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు అన్నారు. బుధవారం పట్టణంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్ అధ్యక్షత జరిగిన రాష్ట్ర సెమినార్‌లో పరస చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మికులు, రైతులు, స్కీమ్ వర్కర్ల ఆదాయం అంతంతమాత్రంగా ఉండటంతో పెరిగిన ధరలు పెనుశాపంగా మారాయన్నారు. కార్పొరేట్ వ్యాపారం పెరిగి చిన్న వ్యాపారులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పరస సత్యనారాయణ ప్రజల కోసం చేసిన ఉద్యమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంతెన సీతారామ్, కె.ఉమామహేశ్వరరావు, పి.రాము, లీల, కె.రాజా రామ్మోహన్‌రాయ్, బి.బలరాం, చింతకాయల బాబురావు పాల్గొన్నారు.

మట్టి పరీక్ష.. పంటకు రక్ష

- భూసార పరీక్షలతో పోషకాల లేమి వెలుగులోకి...
- ఫలితాల ఆధారంగా సేంద్రియ ఎరువుల వినియోగంతో పంటలో అధిక దిగుబడులు
- ఒక్కో ఆర్‌బీకే పరిధిలో 100 నమూనాల సేకరణ
- జిల్లాలో 16 వేల మట్టి నమూనాల సేకరణ లక్ష్యం



మట్టి నమూనాలు సేకరిస్తున్న దృశ్యం

భీమవరం: వ్యవసాయ భూమిలో మట్టిని పరీక్షించడం ద్వారా పోషకాల స్థాయిని తెలుసుకుని అందుకు అనుగుణంగా ఎరువుల వినియోగంతో రైతులు అధిక దిగుబడులు సాధించడంతో పాటు లాభాలు పొందవచ్చు. ప్రధానంగా ఏపంటకు ఎంత మోతాదులో ఎరువులు వాడవచ్చో తెలుసుకునేందుకు మట్టి నమూనా పరీక్షలు ఎంతగానో దోహదం చేస్తాయి. ప్రతి ఏటా వ్యవసాయశాఖాధికారులు రైతుల పొలాల నుంచి మట్టిని సేకరించి పరీక్షలు చేయించడమేగాక ఏ పంటకు ఏ మోతాదులో ఎరువు వాడవచ్చో అవగాహన కల్పిస్తారు. మనిషి ఆరోగ్యానికి సంబంధించిన సమగ్ర సమాచారం తెలుసుకోడానికి రక్త పరీక్షలు చేసినట్లుగానే భూమిలో పంటకు అవసరమైన పోషకాలు సమతుల్యంగా ఉన్నాయో లేదో తెలుసుకోడానికి మట్టి పరీక్షలు ఉపయోగపడతాయి. పొలంలోని మట్టిలో సహజంగా ఉండే పోషకాలు, ఖనిజ లవణాలు ఏ స్థాయిలో ఉన్నాయో భూసార పరీక్ష ద్వారా తెలుసుకోవచ్చు. పరీక్ష ఫలితాలకు తగ్గట్టుగా భూమిలో తగిన మోతాదులో పోషకాలు వాడుకుంటే వ్యవసాయంలో మంచి దిగుబడులు సాధించవచ్చు.

మట్టి నమూనాల సేకరణ ఇలా..

రైతులకు సంబంధించిన పొలాల్లోని భూమిలో త్రిభుజాకారంలో 20 సెంటీమీటర్ల లోతు వరకు గుంత తీసి అందులో పైపొర నుంచి కింద వరకు మట్టిని సేకరించాలి. సేకరించిన మట్టిని ఓ చోట పోసి బాగా కలిపి నాలుగు భాగాలుగా చేయాలి. అందులో ఎదుటి భాగం మట్టిని అర కిలో మేర తీసుకుని మిగతా మట్టిని వదిలేయాలి. సేకరించిన మట్టిలో వ్యర్థాలు లేకుండా చూసుకుని నీడ ఉన్న ప్రదేశంలో ఆరబెట్టాలి. ఆ మట్టికి సంబంధించిన రైతుల పేర్లు, ఊరు, గతంలో ఏ పంట వేశారు. ఏఏ మందులు వాడారు, పంట దిగుబడి ఏ విధంగా వచ్చింది తదితర వివరాలు సేకరించి రికార్డులో నమోదు చేస్తారు. భూసార పరీక్షల కోసం సేకరించిన మట్టి నమూనాలు భూసార పరీక్ష కేంద్రాలకు పంపాలి. మట్టి నమూనాలు రైతులతో వ్యవసాయ శాఖ సహాయకులు దగ్గరుండి చేయిస్తారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి భూసార పరీక్షల ద్వారా సాధించవచ్చు. నేలలో సహజంగా ఉండే పోషక పదార్థాలు తెలియడంతోపాటు చౌడు గుణాలు గుర్తించవచ్చు.

నెల తరువాత ఫలితాలు

జిల్లాలోని 20 మండలాల పరిధిలోని వివిధ గ్రామాల్లో 16 వేల నమూనాలు సేకరించాలని వ్యవసాయశాఖ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఒక్కో రైతు భరోసా కేంద్రం పరిధిలో సుమారు 100 చొప్పున మట్టి నమూనాలు సేకరిస్తారు. గతంలో నమూనాలు సేకరించిన రైతుల పొలం నుంచి కాకుండా వేరొక భూమి నుంచి నమూనాలు సేకరించి తాడేపల్లిగూడెంలోని భూసార పరీక్షా కేంద్రానికి పంపిస్తారు. మట్టి నమూనాలు పంపించిన సుమారు నెల రోజుల తరువాత వాటి ఫలితాలు వెల్లడిస్తారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున మట్టి నమూనాల సేకరణలో జాప్యం జరుగుతున్నట్లు చెబుతున్నారు.

రైతులకు, భూమికి ఎంతో మేలు



వ్యవసాయ సీజన్‌లో పంట సాగుకు ముందు రైతులు భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల రైతులకు, భూమికి ఎంతో మేలు చేకూరుతుంది. భూసార పరీక్షల ద్వారా భూమిలో లోపించిన పోషకాలను గుర్తించి దానికి అనుగుణంగా ఎరువులను వినియోగించడం వల్ల పెట్టుబడి ఖర్చు తగ్గించుకునే అవకాశం ఉంటుంది. భూమికి అవసరమైన మేరకే ఎరువులు వాడడం వల్ల భూమికి కూడా ప్రయోజనం ఉంటుంది. పంటకు అవసరమైన పోషకాలకు రసాయన ఎరువులు వాడేకంటే సేంద్రియ, జీవన ఎరువులు వాడడం వల్ల ఖర్చులు తగ్గించుకుని నాణ్యమైన దిగుబడి పొందవచ్చు. – జెడ్.వెంకటేశ్వరరావు, జేడీఏ, భీమవరం

సున్నాలగండిలో చిరుత దాడి



మేక మృత కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

పోలవరం రూరల్: పోలవరం మండలం సున్నాలగండి గ్రామ సమీపంలో చిరుతపులి దాడిలో ఒక మేక హతమైంది. మంగళవారం రాత్రి ఉడతపల్లి గ్రామానికి చెందిన మడకం వెంకటేశ్వరరావు తన పశువుల పాకలో కట్టిన మేక కనిపించకపోవడంతో రైతు గాలించాడు. సమీపంలోని అటవీ ప్రాంతంలో మొండెంతో ఉన్న మేక మృత కళేబరం కనిపించడంతో పోలవరం అటవీశాఖ రేంజ్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీశాఖ అధికారి ఆర్.దావీదురాజు ఆదేశాల మేరకు సిబ్బంది సున్నాల గండి ప్రాంతంలోని అటవీ ప్రాంతంలో గాలింపు చేపట్టారు. పాదముద్రల ఆధారంగా చిరుత దాడి చేసినట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పశువులు, మేకల భద్రతను కట్టుదిట్టం చేసుకోవాలని అటవీ అధికారులు ఆ ప్రాంతవాసులకు తెలియజేశారు.

క్లుప్తంగా

అభయ గణపతికి ప్రత్యేక పూజలు


అభయ గణపతికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక రామచంద్రరావుపేటలోని కృష్ణ యోగ ధ్యాన మందిరంలో అభయ గణపతి స్వామికి పంచామృతాలతో అభిషేకాలు, సహస్రనామార్చన, పూజలుజరిగాయి. స్వామివారికి నూతన వస్త్రాలు, పుష్పమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమాలను మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.

విఘ్నేశ్వరుడికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో పూజలందుకున్న విఘ్నేశ్వరస్వామి

తణుకు అర్బన్: సంకట హర చతుర్థి సందర్భంగా తణుకు రాష్ట్రపతి రోడ్డులో వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి విశేషంగా అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ అనంతరం పూజాధికాలు జరిపారు. అధికసంఖ్యలో హాజరైన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

క్రమం తప్పకుండా ఓహెచ్‌ఆర్‌లను శుభ్రం చేయాలి


రక్షిత మంచినీటి పథకాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో సుబ్రహ్మణ్య శర్మ

తాడేపల్లిగూడెం రూరల్: గ్రామాల్లోని రక్షిత మంచినీటి పథకాలను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని ఎంపీడీవో ఎస్.సుబ్రహ్మణ్య శర్మ అన్నారు. బుధవారం మండలంలోని కృష్ణాయపాలెం, నందమూరు, ఆరుళ్ల, నవాబుపాలెం గ్రామాల్లో ఓహెచ్‌ఆర్‌లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఈవోపీఆర్‌డీ వెంకటేష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శ్రీనివాస్ ఉన్నారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు


గూడెంలో మాంసం దుకాణాలను తనిఖీ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సుందరరామిరెడ్డి

తాడేపల్లిగూడెం: పట్టణంలోని కొన్ని మాంస విక్రయ దుకాణాల్లో నిల్వ మాంసం విక్రయిస్తున్నారన్న ఫిర్యాదుల మేరకు బుధవారం భీమవరం ఫుడ్ ఇనస్పెక్టర్ సుందరరామిరెడ్డి తనిఖీలు చేశారు. ఈ విషయమై జిల్లా విజిలెన్సు కమిటీ సభ్యుడు ఏఆర్‌కె హనుమంతరావు ఫిర్యాదు చేశారు. దుకాణ దారులకు నోటీసులు ఇవ్వాలని అధికారులను ఆయన కోరారు.

ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించాలి

ఇరగవరం: దేశానికి అన్నంపెట్టే రైతన్నలు సుభిక్షంగా ఉండేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధి చూపాలని రైతులు, నాయకులు డిమాండ్ చేశారు. ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించాలని ఇరగవరం రైతులు బుధవారం డిప్యూటీ తహసీల్దార్ మాలతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ పూర్తిస్థాయిలో ధాన్యం సొమ్ములు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీరవల్లి గణపతి, పతివాడ నాగేశ్వరరావు, పంపన ఏసు, కేత వెంకటేశ్వరరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ ఆలయం హుండీ లెక్కింపు


హుండీ లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక బైపాస్ రోడ్డులోని శ్రీకనక దుర్గమ్మ ఆలయంలో బుధవారం ఆలయం మూడు నెలల హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమం జరిగింది. ఆదాయం రూ.6 లక్షల 61 వేల 606 వచ్చినట్లు అధికారులు తెలిపారు.ఈ లెక్కింపు కార్యక్రమంలో గుడి ఈఓ, సిబ్బంది, నాయకులు చెరుకూరి శేఖర్, ముప్పిడి రమేష్, మజ్జి అప్పారావు, మట్టా రాంబాబు, ఆరాద్యుల అంజి, గుడి కమిటీ చైర్మన్, సభ్యులు పాల్గొన్నారు.

దూకుడుకు కళ్లెం

- మైనర్ల డ్రైవింగ్ నియంత్రణకు చర్యలు
- ప్రత్యేక డ్రైవ్ చేపట్టిన పోలీసులు
- 10 రోజుల్లో 300 కేసులు నమోదు


తణుకులో యువకులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

తణుకు: రహదారిపై నిబంధనలు పాటిస్తూ ప్రయాణించడం అనేది వాహనచోదకుల సమష్టి బాధ్యత. ప్రతి ఒక్కరూ వాటిని సక్రమంగా పాటించినప్పుడే ప్రయాణం సురక్షితంగా ఉంటుంది. ఎలాంటి ప్రమాదం లేకుండా గమ్యానికి చేరుకోగలం. సాధారణంగా డ్రైవింగ్ లైసెన్సు ఉన్న వారందరికీ రోడ్డు నిబంధనలపై అవగాహన ఉంటుంది. అయితే మైనర్లు నిబంధనలు పాటించరు. వేగంగా వాహనం నడపాలనే ఆలోచనతో అనేక ప్రమాదాలకు కారణమవుతున్నారు. మైనర్లు వాహనం నడపడం చట్టరీత్యా నేరమైనప్పటికీ తల్లిదండ్రుల్లో మార్పు రావడం లేదు. ముఖ్యంగా ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైగింగ్, నెంబర్ ప్లేట్లు నింబంధనలు ఉల్లంఘనపై కేసులు నమోదు చేస్తున్నారు. గత పది రోజుల వ్యవధిలో ఇప్పటి వరకు దాదాపు 300 కేసులు వరకు పోలీసులు నమోదు చేశారు.

పెరిగిన రోడ్డు ప్రమాదాలు...

ఇటీవల రోడ్డు ప్రమాదాలు సర్వసాధారణమయ్యాయి. వీటిలో అనేక మంది మృతి చెందుతున్నారు. చాలామంది గాయాలపాలై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఆయా ప్రమాదాల్లో మైనర్లు వాహనాలు నడపడంవల్ల జరిగినవికూడా ఉంటున్నాయి. అవగాహన లేని వయసు, ఉరకలేసే ఉత్సాహంతో మైనర్లు అతి వేగంగా వాహనాలను నడుపుతున్నారు. వేగంగా వెళుతున్నామా, లేదా అనే విషయం తప్ప ప్రమాదాల గురించి ఆలోచించడం లేదు. ఇలాంటి సందర్భాల్లో ప్రమాదం జరిగితే భారీ మూల్యం చెల్లించుకోవాల్సివస్తుంది. పలు ప్రమాదాలు ఇటీవల మైనర్లు వాహనాలు నడుపుతూ పలు ప్రమాదాలకు కారణమయ్యారు. ఈ ఘటనల్లో ఎదుటి వారి ప్రాణాలు కూడా పోయాయి. వీటికి అడ్డుకట్ట వేసేందుకు తణుకు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తున్న తల్లిదండ్రులు, వాహన యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు.

వాహన యజమానులపై కేసులు...

తణుకు పట్టణంలో వివిధ పనుల నిమిత్తం నిత్యం రహదారిపై రాకపోకలు సాగిస్తుంటారు. మన కళ్ల ముందే ఆకస్మాత్తుగా పెద్ద శబ్దంతో రయ్‌మని, ర్యాష్‌గా ద్విచక్ర వాహనాలు దూసుకెళుతూ ఉంటాయి. వాటిని మైనర్లు డ్రైవింగ్ చేస్తూ కనిపిస్తారు. వీరిలో కొందరు వివిధ పనులపై బయటకు వచ్చిన వారైతే, మరికొందరు తమ స్నేహితులతో కలిపి సరదాగా తిరుగుతున్నవారు ఉంటారు. మైనర్ల బాధ్యత లేని డ్రైవింగ్ కారణంగా రహదారి ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. డ్రైవింగ్ చేసే వయసు రాకుండా, లైసెన్సు లేకుండా మైనర్లు వాహనాలు నడిపారంటే దానికి తల్లిదండ్రులతో పాటు వారికి వాహనం ఇస్తున్న వారి తప్పు కూడా ఉంటుంది. పిల్లల ఆనందం కోసం వారి బంగారు భవిష్యత్తు నాశనం చేస్తున్నారు. ఇలాంటి సందర్భాల్లో ప్రమాదాలు జరిగితే వాహన యజమానులపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు.

వాహనం ఇవ్వడం నేరం

తణుకు: మైనర్లకు వాహనం ఇస్తే కేసులు తప్పవని పోలీసులు ప్రచారం చేస్తున్నారు. ప్రమాదం జరిగిన అనంతరం వాహన యజమానులపై కేసులు నమోదు చేయడం కన్నా, ప్రమాదాలు జరగకుండా ముందుగానే అడ్డుకట్ట వేయడం ప్రధానమనే ఆలోచనతో చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలను నడపకుండా నియంత్రించడానికి కార్యాచరణ రూపొందించారు. దీనిలో భాగంగా స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తూ, విస్తృతంగా వాహనాల తనిఖీలు చేస్తున్నారు. డ్రైవింగ్‌లో పట్టుబడిన మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఆయా వాహనాలను స్వాధీనం చేసుకుని ఆ వాహన యజమానులను, మైనర్ల తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి అవగాహన కల్పిస్తున్నారు. మరోసారి వారికి వాహనం ఇవ్వకుండా ప్రథమ తప్పిదంగా హామీ పత్రం రాయించుకుంటున్నారు.

చర్యలు తప్పవు

మైనర్లకు వాహనాలిస్తే ఇచ్చిన వ్యక్తులపై కేసులు నమోదు చేస్తాం. పిల్లలకు వాహనాలు ఇస్తున్న తల్లిండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. చాలా మంది యువత డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తున్నారు. వారిపైనా ప్రత్యేక దృష్టి సారించాం. ప్రత్యేకంగా కళాశాలలు, స్కూళ్ల వద్ద నిఘా ఉంచి నిర్లక్ష్యంగా వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తాం.

– ఎం.నాగరాజు, పట్టణ సీఐ, తణుకు

శశి విద్యార్థుల ప్రతిభ


భూపతిరాజు ప్రవల్లిక, 466


మీసాల జయరామ్, 466

తణుకు టౌన్: ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరం బెటర్‌మెంట్ పరీక్షలలో తణుకు శశి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణు గోపాల కృష్ణ తెలిపారు. తమ విద్యార్థులు ఎంపీసీ విభాగంలో భూపతిరాజు ప్రవల్లిక, మీసాల జయరామ్, కె రామ్‌చరణ్, బడేటి హరిడి శ్రీకృష్ణలు 470 మార్కులకు 466 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఎంపీసీలో తమ విద్యార్థులు 465 మార్కులకు పైగా 17 మంది విద్యార్థులు, 460 మార్కులకు పైగా 75 మంది విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. బైపీసీ విభాగంలో కె శ్రావణి, యూ సంకీర్తనా ఝాన్సీలు 440 మార్కులకు గానూ 436 మార్కులు సాధించినట్లు తెలిపారు. బీపీసీలో తమ విద్యార్థులకు 430 మార్కులకు పైగా 7గురు, 400 మార్కులకు పైగా 34 మంది సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, అకడమిక్ డైరెక్టర్ మేకా క్రాంతి సుద, ప్రిన్సిపల్ రాఘవేంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, కాంపస్ ఇన్‌చార్జి నిమ్మగడ్డ రాజేంద్రప్రసాద్ అభినందించారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి


తణుకులో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు: పట్టణంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అధికారులను ఆదేశించారు. తణుకు మున్సిపల్ అధికారులతో బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాబోయే రోజుల్లో మరోసారి కౌన్సిల్ ఏర్పడే వరకు నాయకులు అందరి సహకారంతో సమగ్రమైన మార్గంలో ముందుకు తీసుకెళ్లే బాధ్యత ఉద్యోగులందరిపైనా ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా పట్టణంలో రోడ్లు విస్తరణ, అభివృద్ధి చేస్తామని తెలిపారు. అనంతరం అతిసార వ్యాధులు రాకుండా చర్యలు తీసుకునే గోడ పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బీవీ రమణ, డీఈ కె.ఈశ్వరరెడ్డి, టీపీవో టి.నాగేంద్రమణిరామ్, ఏఈ రామకిషోర్, మున్సిపల్ మాజీ చైర్మన్లు పరిమి వెంకన్నబాబు, డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, మాజీ వైస్ చైర్మన్ మంత్రిరావు వెంకటరత్నం, మాజీ ఏఎంసీ చైర్మన్ బసవా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు ఉచిత వైద్య శిబిరం


తణుకులో ఉచిత వైద్య శిబిరంలో వైద్యసేవలు అందజేస్తున్న వైద్యులు

తణుకు అర్బన్: వృత్తిలో భాగంగా ఒత్తిడిని ఎదుర్కొనే న్యాయవాదుల సౌకర్యార్థం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తణుకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్ అన్నారు. తణుకు బార్ అసోసియేషన్ భవనంలో బుధవారం రాజమండ్రి డెల్టా హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. న్యాయవాదులంతా తమ ఆరోగ్య స్థితిపై క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. ఈ సందర్భంగా శిబిరానికి హాజరైన 130 మంది న్యాయవాదులకు డెల్టా హాస్పటల్ వైద్యులు డాక్టర్ సుధ ప్రశాంతి, సిబ్బంది ఆనంద్ ఆధ్వర్యంలో బీపీ, సుగర్‌తో పాటు ఈసీజీ రక్తపరీక్షలు నిర్వహించారు. న్యాయవాదులు ఈదా రామకృష్ణ మృత్యుంజయరావు, నండూరి రామ్మోహన్, రెంటాల వెంకటేశ్వరరావు, కొండా శ్రీనివాస్ పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఉల్లాసం


యోగా గురువులకు సత్కారంలో పాల్గొన్న కమిషనర్ మురళీకృష్ణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): యోగా చేయడం ద్వారా మానసిక ఉల్లాసం సాధ్యపడుతుందని పలువురు వక్తలు తెలిపారు. స్థానిక గుణ్ణం కల్యాణ మండపంలోని సత్య సాయి ధ్యాన మండలి నిత్య యోగ సాధన కేంద్రం ఉచిత యోగ శిక్షణ 8 వసంతాలు పూర్తి చేసుకుని 9వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా బుధవారం ఉదయం 80 మంది యోగా సభ్యులు హాజరై వివిధ యోగా ఆసనాలు వేశారు. మునిసిపల్ కమిషనర్ మురళీ కృష్ణ విచ్చేసి యోగ సాధకులకు అభినందనలు చెప్పారు. అనంతరం యోగా గురువులు బడుగు చంద్రశేఖర్, సుధాకర్, గుణ్ణం లక్ష్మి ప్రసాద్ తదితరులను సత్కరించారు. వక్తలు మాట్లాడుతూ యోగా ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరు యోగా చేయాలని విజ్ఞప్తి చేశారు. యోగా సభ్యులు పాల్గొన్నారు.

ఛత్రపతి సాహు మహరాజ్‌కు నివాళులు

తణుకు అర్బన్: ఆల్ ఇండియా పూలే అంబేడ్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఛత్రపతి సాహు మహరాజ్ 150వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వసతి గృహ విద్యార్థినుల మధ్య నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు, న్యాయవాది పొట్ల సురేష్ మాట్లాడుతూ సామాజిక సంస్కరణ భారతదేశ రిజర్వేషన్ పితామహుడు దీన బాంధవుడు సాహు మహరాజ్ అన్నారు. అణగారిన కులాల అభ్యున్నతి కోసం విప్లవాత్మకమైన పథకాలను సాహు పాలనలో నిబద్ధతతో అమలు చేశారన్నారు. సాహు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా ఉద్యాన వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ 17వ వ్యవస్థాపక దినోత్సవం బుధవారం సాయంత్రం వేడుకగా సాగింది. ముఖ్యఅతిథిగా ఉపకులపతి డాక్టర్ తోలేటి జానకీరామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు ఎం.సుభద్ర, పి.వరప్రసాద్, ఎస్.ముత్యాలప్ప, పి.మాలకొండయ్య, జీమురళీలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. యూనివర్సిటీ గీతాన్ని ఆవిష్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం


జగన్నాథపురం గ్రామంలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ చంద్రిక


విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న నాయకులు


అప్పారావుపేట గ్రామంలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని జగన్నాథపురం సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక అన్నారు. బుధవారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రిక మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పుస్తకాలను, సౌకర్యాలను వినియోగించుకుని ఉన్నత విద్యావంతులుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నాగులు, పుల్లా అన్నవరం, గెడ్డం సాల్మన్‌రాజు, అబ్బిన నాగమణి,ముత్యాల అచ్చిబాబు, కోపల్లి జయ, టి.నాని, పల్నాడు సతీష్, వాసు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యా కానుకలు అందజేత

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉన్నతశిఖరాలను అధిరోహిస్తారని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక పాలూరి స్వాములు మునిసిపల్ స్కూల్‌లోని విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ స్కూల్స్‌లోని విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించడమేగాక బుక్స్, యూనిఫామ్ వంటివి ఉచితంగా అందిస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బొలిశెట్టి రాజేష్, పాలూరి వెంకటేశ్వరరావు, నాగబలుసులరావు (బూరయ్య), సాయి కృష్ణ, సందీప్, వర్తనపల్లి కాశీ, సత్తిబాబు, దూలం రామకృష్ణ, గంట సుబ్బారావు, శేషు, నాగు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాధవరంలో పుస్తకాలు పంపిణీ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం స్టూడెంట్ కిట్లను గ్రామ సర్పంచ్ సూర్యకుమారి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అనంతరం గత ఏడాది పదో తరగతిలో స్కూలు ఫస్ట్ సాధించిన విద్యార్థిణి కొల్లాటి భాగ్య లహరికి రూ.5వేలు ప్రోత్సాహాన్ని గోపిశెట్టి భరతుడు అందజేశారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు, అంగిన సత్తిబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు. అలాగే, అప్పారావుపేట గ్రామంలోనూ పుస్తకాలు పంపిణీ చేశారు. సర్పంచ్ ఆరుగొలను శ్రీనివాస్, ఎమ్పీటీసీ మార్లపూడి సుబ్బారావు, కొండపల్లి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

తణుకు అర్బన్ : ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం గురువారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తణుకు డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ తెలిపారు. తణుకు డిపో నుంచి ప్రయాణించే ఆర్టీసీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, స్లీపర్ సర్వీసులకు సంబంధించి ప్రయాణికులు తమ విలువైన సూచనలు, ఫిర్యాదులను 99592 25484 నంబరులో తెలపాల్సిందిగా కోరారు. ప్రయాణికులు తెలిపిన సూచనలు, ఫిర్యాదులను పరిష్కరించి మరింత మెరుగైన సేవలను అందిస్తామని వివరించారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి


తణుకు: వెంకటేశ్వర థియేటర్ సెంటర్‌లో విద్యార్థులు మానవహారం


తాడేపల్లిగూడెం (టీఓసీ) : ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

తణుకు: డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకోవడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని తణుకు స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ సీఐ మద్దాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని తణుకు ఎస్ఈబీ స్టేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఎంవీఎం పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వలలో పడి విలువైన జీవితాలు పాడుచేసుకోవద్దని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి తణుకు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్ఐ తుంగం వెంకటేశ్వరరావు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తణుకులో విద్యార్థుల మానవహారం

యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా జాగ్రత్తలు వహించాలని తణుకు పట్టణ సీఐ ఎం.నాగరాజు పేర్కొన్నారు. డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని తణుకు పట్టణ పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో తణుకు పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ జానా సతీష్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇరగవరం: మండలంలోని కె ఇల్లిందలపర్రు గ్రామంలో బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ ఎఎన్ఓ కె వి ఆర్ సుబ్బారావు, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు ఎ నాగమణి, ఉపాధ్యాయులు రత్నం, సిబ్బంది పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం: విద్యార్థులతో మాదకద్రవ్యాల వ్యతిరేక ర్యాలీలో ఎస్ఈబీ సీఐ మద్దాల శ్రీనివాసు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

తణుకు అర్బన్: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ప్రియాంక హాస్పటల్ వైద్యులు డాక్టర్ కుదారి ఆనంద్ అన్నారు. ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా తణుకు నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి ఆదేశాల మేరకు మండల న్యాయసేవా సంస్థ ఆధ్వర్యాన బుధవారం స్థానిక ప్రియాంక హాస్పటల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కౌరు వెంకటేశ్వరరావు, కామన మునిస్వామి, ముప్పిడి సుబ్బయ్య, తిర్రే సత్యనారాయణరాజు, అజయ్‌కుమార్, నర్సింగ్ విద్యార్థినులు, రోగులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

తాడేపల్లిగూడెం: మాదక ద్రవ్యాల వలలో పడి విలువైన జీవితాలు పాడుచేసుకోవద్దని విద్యార్థులకు ఎస్ఈబీ సీఐ మద్దాల శ్రీనివాసు కోరారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని బుధవారం విద్యార్థులతో పట్టణంలో జరిగిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మి, ఆదిత్య కళాశాల ప్రిన్సిపాల్ సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలపై యువత అప్రమత్తత అవసరం

పెంటపాడు: మత్తు పదార్థాలతో ఆరోగ్యం చిత్తవుతుందని డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ప్రపంచ మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం కళాశాలలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి విక్టర్ ప్రేమ్‌సాగర్, ఎన్ఎస్ఎస్ అధికారి విజయబాబు, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): మత్తు మందులు వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కలిగి ఉండాలని, వాటిని ఉపయోగించకూడదని సైకాలజిస్ట్ టి.గంగాధర్ విద్యార్థులకు సూచనలు చేశారు. దేవి ఎడ్యూకేషనల్ సొసైటీ, దీక్ష-మత్తు మందుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ మత్తు మందుల వ్యతిరేక దినోత్సవాన్ని ఆదిత్య కళాశాలలో నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.


తణుకు: విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేసిన ఎస్ఈబీ సీఐ శ్రీనివాసరావు


పెంటపాడు: డీఆర్‌గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


ఇరగవరం: కెఇల్లిందలపర్రులో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు


తణుకుఅర్బన్: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ ఆనంద్